## గొర్రె వెంకట్‌రెడ్డిని పరామర్శించిన హరీశ్‌రావు


గొర్రెవెంకటరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, నాయకులు

శివ్వంపేట, జూన్ 22 : శివ్వంపేట మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని కిమ్స్ దవాఖానలో వైద్యం చేయించుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు దవాఖానకు చేరుకొని గొర్రెవెంకట్‌రెడ్డితో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితులపై డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

## ఆరోగ్యకేంద్రాల్లో గణనీయమైన మార్పులు

- కస్తూర్బా గాంధీలో మెరుగైన సౌకర్యాల కల్పన
- కలెక్టర్ రాహుల్ రాజ్


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

అల్లాదుర్గం, జూన్ 22: జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆదివారం అల్లాదుర్గంలోని బాలుర వసతి గృహం,కస్తూర్బా గాంధీ విద్యాలయం,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు లేకపోవడంతో పక్కనే ఉన్న బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహంలోని మరుగుదొడ్లు,వంటగదిలోని సా మగ్రిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ వసతి గృహంలో నెలకొ న్న సమస్యలు, విద్యాబోధనపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కాస్మోటిక్ చార్జీలు సకాలంలో అందుతున్నాయా అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలం ప్రారంభమైన నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులకు, సిబ్బందికి సూచించారు. దవాఖానలో మందుల కొరత ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. దవాఖానకు వచ్చే రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. కలెక్టర్ వెంట వైద్యాధికారి సంధ్య, సిబ్బంది సుధాకర్, హసీనా, వార్డెన్ కిశోర్ తదితరులు ఉన్నారు.


దవఖానాలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

## కేసీఆర్ ముందు చూపుతోనే ప్రాజెక్టుల నిర్మాణంతో సాగు, తాగు నీరు

- రైతులను విస్మరించిన కాంగ్రెస్ సర్కార్
- రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు సోములు


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

చేగుంట, జూన్22: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీని విస్మరించి 25 శాతం రైతులకు కూడా పంట రుణమాఫీ చేయలేదని రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఆడెపు సోములు, బీఆర్‌ఎస్ చిన్న శంకరంపేట అధ్యక్షుడు పట్లోరి రాజు విమర్శించారు. ఆదివారం కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద విలేకర్లతో మాట్లాడుతూ కేసీఆర్ ముందు చూపుతోనే ప్రాజెక్టులు నిర్మిచడంతో రైతాంగానికి సాగునీరు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాగు నీరు అందుతున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో రైతులకు ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. బీఆర్ హయాంలో సీఎం కేసీఆర్ కాళేశ్వరం, మల్లన్న సాగర్ వంటి భారీ ప్రాజెక్టులు నిర్మించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను గాలికి వదిలేసి, ప్రశ్నిస్తే కేసులు, దాడులకు పాల్పడుతున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశం, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడం సరికాదు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 22: రాష్ట్రంలోని పాఠశాలల పనితీరును పర్యవేక్షించడానికి ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ టీచర్లను పర్యవేక్షణ అధికారులుగా బాధ్యతలు అప్పగించడం సరికాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్ అన్నారు. ఇది విద్యారంగ తిరోగమన చర్య అని, ప్రభుత్వం తక్షణమే ఈ ఉత్తర్వులను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో నాయకులు పోచయ్య, రాజు, ఎల్లం, వెంకటకృష్ణతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో 629 మండలాలు, 1,187 క్లస్టర్ల పరిధిలో గల 24,146 పాఠశాలలను తనిఖీ చేయడానికి పది సంవత్సరాలు అనుభవం గల సుమారు 2 వేలకు పైగా ఉపాధ్యాయులకు తనిఖీ బాధ్యతలు అప్పగించి, విద్యాసంవత్సరం పొడవునా వారిని తనిఖీ బాధ్యతల్లో ఉంచడంతో, వారు సేవలిందిస్తున్న ఆయా పాఠశాలల్లో బోధన స్తంభించిపోతుందన్నారు. ఒకవైపు ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో విద్యాప్రమాణాలకు చర్యలు తీసుకుంటామని చెబుతూనే ఇలాంటి చర్యలకు పాల్పడటం అనాలోచిత చర్య అన్నారు. కామన్ సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి పూర్తిస్థాయి మండల విద్యాధికారులను నియమించి పాఠశాలల పర్యవేక్షణ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పాఠశాలల్లో వేలాది ఉపాధ్యాయ ఖాళీలు ఉండటంతో బోధన కుంటుపడుతుందని, వెంటనే డీఎస్సీ ప్రకటించి, ఉపాధ్యాయ నియామకాలను చేపట్టాన్నారు.

# ఆఖిరి మజిలీకి అవస్థలు

- అరకొర వసతులతో పట్టణవాసులకు ఇబ్బందులు
- నిర్మాణం చేపట్టి మూడేండ్లయినా రాని బిల్లులు
- అర్థాంతరంగా నిలిచిపోయిన పనులు
- టీయూఎఫ్‌ఐడీసీ నుంచి రూ.1కోటి నిధులు మంజూరు చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- పనులు నిలిచినా పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్


నిర్మాణ దశలోనే ఉన్న రామాయంపేట పట్టణంలోని కాళ్లగడ్డ శ్మశాన వాటిక


రామాయంపేట: నిర్మించి మూడేండ్లయినా ఖననానికి నోచుకోని వైకుంఠధామం


రామాయంపేట: పాతదాంట్లోనే మృతదేహాలను ఖననం చేస్తున్న సిబ్బంది

రామాయంపేట/మెదక్ రూరల్, జూన్22: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన వైకుంఠధామాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మెదక్ మండలంలో ఉన్న 29 పంచాయతీల్లో వైకుంఠ ధామాలు నిర్మించారు. 19 పంచాయతీల్లో ఒక్కో వైకుంఠధామానికి సుమారు రూ.10 నుంచి 13లక్షల వ్యయంతో నిర్మించారు. వీటిని నిర్మించి మూడేండ్లు కావస్తున్నా కొన్నిచోట్ల ప్రారంభానికి నోచుకోలేదు. నిర్మించిన సగం వైకుంఠధామాల్లో కనీస మౌలిక వసతులు లేక కూనరిల్లుతున్నాయి.

### సమస్యలతో సతమతం

వైకుంఠధామాల్లో కనీస వసతులు లేక తంటాలు పడుతున్నారు. గోడలు పలిగి, బాత్ రూంల్లో నీళ్లు రాక, రూములకు తలుపులు లేక అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా మృతి చెందితే పడరాని పాట్లు పడాల్సి వస్తున్నది. వైకుంఠదామంలో స్నానాలకు, కనీసం కాళ్లు కడుకుందామన్నా నీళ్లు లేవు. కుండలో నీళ్లు తెవాలన్నా కష్టమే. ఎవరు చనిపోయినా రూ.వెయ్యి పెట్టి ట్యాంకర్ తెచ్చుకోవాల్సిందే. ఆ ట్యాంకర్ నీటితోనే స్నానాలు చేయాలి. వచ్చినవారు కాళ్లు, చేతులు కడుక్కుని వెళ్లాలి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిలిచిపోయిన వైకుంఠధామాల పనులను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

### బిల్లులిస్తేనే పనులు చేస్తామంటున్న కాంట్రాక్టర్లు

రామాయంపేటలో వైకుంఠధామాల నిర్మాణానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించింది. అధునాతనంగా నిర్మించా లని టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. పట్టణంలో రెండు కోట్ల పనులు చేపట్టనేలేదు. పట్టణంలోని కాళ్లగడ్డకు రూ.కోటి నిధులు మంజూరై వైకుంఠధామాలపనులు మొదలుపెట్టారు. రూ.కోటికిగాను 90శాతం పనులు పూర్తి చేశారు. అంతలోపే ప్రభుత్వం మారిపోయిం ది. కాంగ్రెస్ సర్కార్ రావడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులన్నీ ఆగిపోయాయి. వారికి వచ్చే బిల్లులు కూడా రావడం లేదు. చేసేదేమీ లేక సంబంధిత కాంట్రాక్టర్ బిల్లులు పనులు వదిలేశారు. బిల్లులిస్తేనే పనులు చేస్తానంటు మొండికేశారు.


రామాయంపేట: పనులు పూర్తికాక ఉత్సవ విగ్రహంలా ఉన్న నూతనంగా నిర్మించిన భవనాలు

## సీఎం ఆర్‌ఎఫ్ పేదలకు వరం

**- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి**



కౌడిపల్లి, జూన్22: పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం లాంటిదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బుజురంపేట గ్రామ పంచాయతీలోని పేర్య తండాకు చెందిన నెనావత్ గోప్యకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును హైదరాబాద్, మాదాపూర్‌లోని ఆమె నివాసంలో బాధిత కుటుంబ సభ్యుడికి అందజేశారు.

## రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు 18 మంది ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 22: ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు ఆదివారం మెదక్‌లోని సాయ్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లా నుంచి 95 మంది క్రీడాకారులు పాల్గొనగా, ప్రతిభ కనబర్చిన 18 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 27 నుంచి జూలై 1 వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా తరపున క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ ఎంపికల్లో ఫుట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు నగేశ్, సత్యనారాయణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## అడవిలో పాపం పసివాడు


మగ శిశువుని ఐసీడీఎస్ సిబ్బందికి అప్పగిస్తున్న పోలీసులు

నర్సాపూర్,జూన్22ః మానవత్వం మంటగలిచేలా.... సభ్య సమాజం తలదించుకునేలా...అభం శుభం తెలియని నాలుగు నెలల ఓ పసుకందుని నిర్దాక్షిణ్యంగా అడవిలో వదిలి వెళ్లిన సంఘటన ఆదివారం నర్సాపూర్ మండల పరిధిలోని కొండాపూర్ అటవి ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం అరుమల్ల వరుణ్ అనే వ్యక్తి తన వాహనంలో మెదక్ నుండి హైదరాబాద్ వెళ్తుండగా నర్సాపూర్ మండల పరిధిలోని కొండాపూర్ అటవి ప్రాంతంలో మూత్రవిసర్జన కోసమని కారు దిగాడు. రోడ్డు పక్కకు వెళ్ళగానే ఓ పసిబాలుడి ఏడుపులు వినపడగా 108కి కాల్ చేసి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కేతావత్ మోహన్, ఆంజనేయులు అనే కానిస్టేబుళ్లు ఘటనా స్థలానికి చేరుకోగా గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు నెలల మగ శిశువుని రోడ్డు పక్కన వదిలి వెళ్లడం గ్రహించారు. చుట్టుపక్కల బాలుడికి సంబంధించిన వారు ఎవరు లేకపోగా శిశువు గుక్కపట్టి ఏడుస్తూ తారాసపడ్డాడు. వెంటనే శిశువుని నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ శిశువు వివరాల గురించి విచారించగా తెలియరాలేదు. అనంతరం పసికందును చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై లింగం వెల్లడించారు. పసికందును అడవిలో వదిలి పెట్టడానికి చేతులెలా వచ్చాయంటూ పలువురు ఆగ్రహాన్ని, బాధను వ్యక్తపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

### తునికి నల్ల పోచమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

కౌడిపల్లి, జూన్22: తునికి నల్ల పోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఈవో రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజారులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులు ఒడిబియ్యం, బోనాలు సమర్పించారు. కొందమంది తలనీలాలు సమర్పించుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



రామాయంపేట, జూన్ 22: మండలంలోని రాయిలాపూర్‌కు చెందిన ఎడ్ల మాణిక్యం అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సంఘ సంఘ సేవకుడు మోహన్‌నాయక్ ఆర్థిక సాయం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రాజేందర్, రమేశ్, బాలకృష్ణ, సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### చిన్ననాటి స్నేహితుల ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న మాధవి చిన్ననాటి స్నేహితులు

శివ్వంపేట, జూన్ 22: మండలంలోని పెద్ద గొట్టిముక్ల గ్రామానికి చెందిన వడ్ల మాధవి విధి వక్రీకరించి తన భర్తను కోల్పోయి, ఇద్దరు ఆడపిల్లలను పోషించుకోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. గోమారం జడ్పీహెచ్‌ఎస్ 2011-12లో పదో తరగతి చదువుకున్నది. మాధవితో చదువుకున్న స్నేహితులు ఆమె ఆర్థిక ఇ బ్బందులు ఎదుర్కొంటున్నదని తెలుసుకొని రూ.40 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. తామంతా అండగా ఉన్నామని మాధవి స్నేహితులు ధైర్యం చెప్పారు. ఆర్థిక సాయం అందించిన వారిలో కుంట నగేశ్, ఏనుగు ఎల్లారెడ్డి, తాటి సాయికిరణ్, కుమ్మరి నాగరాజు, గుండ లక్ష్మణ్, కుమ్మరి ఆంజనేయులు , కుక్కల శ్రీఆంత్, కుమ్మరి అనిల్, మన్నె ప్రశాంత్, గుండ రమేశ్, గుం డ శ్రీకాంత్, గొరకంటి స్వామి ఉన్నారు.

## నేడు జక్కపల్లి శ్రీనివాస్ విగ్రహావిష్కరణ


దుప్తల శ్రీనివాస్(ఫైల్)

నర్సాపూర్, జూన్22: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, నీతినిజాయితీగా బతికిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దివంగత దుప్తల శ్రీనివాస్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించనున్నారు. మండలంలోని జక్కపల్లిలో నిర్వహించనున్న ఈ వేడుకకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరుకానున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు జక్కపల్లి గ్రామ గేట్ వద్ద వారు శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని ఆత్మకమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి


మెదక్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 22: మెదక్ చర్చి ఆదివారం భక్తులు, పర్యాటకులతో కిటకిటలాడింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని యేసయ్యకు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రెసీబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య భక్తులనుఉద్దేశించి దైవసందేశం వినిపించారు. భక్తులు చర్చి ఆవరణలోని చెట్ల కింద వంటావార్పు చేసుకున్నారు. ప్రార్థనల్లో పాస్ట ర్లు జైపాల్, శ్రీనివాస్, డేవిడ్, చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సువన్ డగ్లస్, జాన్స న్, సంశాన్‌సందీప్, జాయ్‌ముర్రే పాల్గొన్నారు.

## మల్లె చెరువు చేపలు పెద్దమ్మకే చెందాలి

**లక్షల రూపాయలు కాజేసిన పెద్ద మనుషులు**
**పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ముదిరాజ్ సంఘం**


రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో ముదిరాజ్ సంఘం నాయకులు

రామాయంపేట, జూన్22: ముదిరాజ్ సంఘం పెద్దలు కొన్నేండ్లుగా చెరువుల నుంచి చేపలు అమ్ముకుంటూ లక్షల రూపాయలు తినేశారని రామాయంపేట ముదిరాజ్ సంఘం నాయకులు దేవుని రవి, చిలుక గంగాధర్, రెడ్డమైన నరేశ్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో సమావేశం ఏర్పాటు చేసి పలు తీర్మానాలు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కొంతమంది వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ మూడేండ్లుగా ముదిరాజ్ సంఘానికి రావాల్సిన చేపల డబ్బులను సంఘానికి ఇవ్వకుండి ముగ్గురు వ్యక్తులే దాదాపు రూ.20 నుంచి 30లక్షల వరకు మాయం చేశారని ఆరోపించారు. వారిపై పోలీసులు చర్యలు చేపట్టాలని, వారి వద్ద నుంచి ఆ డబ్బులు రికవరీ చేయాలని కోరారు. మూడు చెరువులకు చెందిన డబ్బుల లెక్కలను కూడా మూడేండ్లుగా చూపించలేదన్నారు. పెద్దమ్మ జాతరకు ఏటా రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని, ఆ లెక్కలు అడిగితే చేతులెత్తేశారని తెలిపారు. తాము ఫిర్యాదు చేసిన వారిపై కేసు నమోదు చేయాలని సంఘ సభ్యులు తెలిపారు. మూడు చెరువుల నుంచి ఒక చెరువులో పట్టే చేపల డబ్బులు పెద్దమ్మ జాతరకు ఖర్చు చేయాలన్నారు.

# ఆరోగ్య ప్రదాయిని.. అల్లనేరేడు


అల్లనేరేడు పండ్లు విక్రయిస్తున్న మహిళా వ్యాపారి



రామాయంపేట, జూన్ 22: కొంచెం తీపి, మరికొంచెం వగరుగా ఉండే అల్లనేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. వానకాలంలో మార్కెట్లో విరివిగా వస్తుంటాయి. ఈ పండ్లు సీజనల్‌గా వస్తాయి. వీటిని ఇష్టపడని వారుండరంటే అతిశయోక్తికాదు. అల్లనేరేడు పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు కూడా చెబుతున్నారు. ఇందులో విశిష్ట గుణాలుంటాయి. మధుమేహం, కిడ్నీ రోగులకు ఇవి దివ్య ఔషధంగా పనిచేస్తాయి. అల్లనేరేడు పండ్ల చెట్లు సాధారణంగా ఇండ్ల ఆవరణలో కనిపించేవి. కాలక్రమేనా అవి ఎక్కువ శాతం అడవి ప్రాంతంలోనే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో హైబ్రిడ్ రకం పండ్లు జోరుగా రావడంతో డిమాండ్ బాగా పెరిగింది. సాధారణ రకం నేరేడుపండ్లు మార్కెట్లో కిలో రూ.100 పలుకగా, హైబ్రిడ్ రకం పండ్లు రూ.120 నుంచి రూ.150 ధర పలుకుతుంది. ఏటా మే, జూన్‌లో వచ్చే ఈ నేరేడు పండ్ల కోసం గ్రామాల్లోని కొంతమంది రోజూ ఉదయమే అడవిబాట పట్టి మధ్యాహ్నం వరకు గంపల్లో తీసుకొచ్చి మార్కెట్లో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం పండ్ల షాపుల్లో హైబ్రిడ్ పండ్లు విక్రయిస్తున్నారు. దీంతో తమ పండ్లను వినియోగదారులు కొనడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లనేరేడు పండ్లు విక్రయించే వారు రామాయంపేట పట్టణంతో పాటు మండలంలో ఎక్కువగా కనిపిస్తుంటారు. ఈ పండ్లపై అవగాహన పెరగడంతో ప్రజలు కూడా వీటిని తినడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

### గర్భిణులకు నేరేడుతో మేలు



అల్లనేరేడు సర్వరోగ నివారిని. ఈ పండ్లలో ఏ, సీ, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఈ పండ్లకు మనలో ఉన్న మలినాలు, విషాన్ని అరికట్టే శక్తి ఉంటుంది. గర్భిణులు ఈ పండ్లను తింటే మేలు జరుగుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు, కిడ్నీ, షుగర్, నోటిపూత, నోటి క్యాన్సర్, మూత్రాశయ సమస్యలకు టానిక్‌లా పనిచేస్తాయి. చిగుళ్లవ్యాధితో బాధపడే వారికి నేరేడు గింజలను చూర్ణం చేసి తాగ్గిస్తారు. ఎక్కువ శాతం ప్రజలు వీటిని తినడానికి మొగ్గు చూపుతారు. **-హరిప్రియ, ప్రభుత్వ వైద్యురాలు, రామాయంపేట**

### సీజన్‌లోనే విక్రయిస్తుంటాం



అల్లనేరేడు పండ్లు ఎండాకాలంలోనే ఎక్కువగా లభిస్తాయి. గతంలోనైతే అడవికి దగ్గరలోనే ఉంటుండే. ప్రస్తుతం అవి దొరకాలంటే అడవిలో కిలోమీటర్ల దూరం వెళ్లాలి. ప్రతి రోజు తెల్లవారుజామున లేచి పది కిలోమీటర్ల మేర అడవికి పోతే ఎక్కడో ఓ చోట చెట్టు కనిపిస్తది. ఆ చెట్టు పైకెక్కి జాగ్రత్తగా పండ్లు తెంపాలి. ఏ మాత్రం అజాగ్రత్త వహిస్తే పండ్లన్నీ చెడిపోతాయి. నేరేడు పండ్లను గంపల్లో తీసుకొచ్చి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తుంటాం. ప్రస్తుతం వీటీని కిలో రూ.100లకు అమ్ముతున్నాం.

**- లంబాడీ సుగుణ, నస్కల్ గ్రామం, నిజాంపేట మండలం**

## ఆ ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 22: జిల్లాలో అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీశ్‌పటేల్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా చేసుకుని యూనిఫామ్‌లు, బ్యాగులు, పాఠ్యపుస్తకాలు తదితర పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇష్టారీతిలో ఫీజులు పెంచుతున్నారన్నారు. ఇప్పటికైనా అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## విద్యుదాఘాతంతో ఎలక్ట్రిషియన్ మృతి


మర్రి రాములు మృతదేహం

తూప్రాన్, జూన్ 22: విద్యుదాఘాతంతో ఎలక్ట్రిషియన్ మృతి చెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాపూర్ గ్రామానికి చెందిన మర్రి రాములు (50) మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్‌లో గ్రామ పంచాయతీలో ఔట్ సోర్సింగ్ ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం కాళ్లకల్ గ్రామంలో ఓ రైతు పొలంలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు షాక్ తగిలి కింద పడిపోయాడు. రాములును వెంటనే తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.